అమలు కాని ప్లాస్టిక్ ట్రిక్

- గ్రామాల్లో యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగం
- పట్టించుకోని అధికారులు
- ఇంకిపోని వ్యర్థాలతో నిండుతున్న డంపింగ్‌యార్డులు

పిఠాపురం: గ్రామాల్లోని రోడ్లు..డ్రైన్లు..వీధులు ఇలా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. గతంలో ప్లాస్టిక్ వినియోగం తక్కువగా ఉన్నప్పుడు డంపింగ్ యార్డుల్లో చెత్త ఇంకిపోయి ఎన్ని టన్నులు వేసినా ఎరువుగా మారేది. ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల ఎరువులకు బదులు కాలుష్యం కన్స్ట్రక్ట్ చేస్తోంది. ప్లాస్టిక్ వాడకం పర్యావరణానికి పెను ముప్పుగా తయారైంది. ఇది గ్రహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగాన్ని నిషేధించాయి. ప్లాస్టిక్ నిషేధం కఠినంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినా ఆరంభ సూరత్వం తప్ప నిషేధం అమలు కావడం లేదు. దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్ల వినియోగం యథేచ్ఛగా సాగిపోతోంది. కొన్ని రోజులు హడివిడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకోకపోవడంతో వాటి అమ్మకాలు, వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతోంది. అతి చౌకగా వాడుకలోకి వచ్చిన ప్లాస్టిక్ సంచుల వినియోగం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పిఠాపురం పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై నిషేధం విధించినప్పటికీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో నిషేధం నీరుగారుతోంది. కఠిన నిర్ణయాలతో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని పర్యావరణ వేత్తలు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.



ప్లాస్టిక్ కవర్లలో నిత్యావసరాలు తీసుకెళ్తున్న దృశ్యం

టన్నుల కొద్దీ వ్యర్థాలు

ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ప్రతిరోజూ టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డుకు చేరుతున్నాయి. సాధారణ చెత్తాచెదారం కొన్ని రోజులకు భూమిలో కలిసిపోతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు మాత్రం సంవత్సరాల తరబడి ఏ మాత్రం పాడవకుండా భూమిలో ఇంకిపోకుండా ఉండిపోతుండంతో కాలుష్యం కారుమబ్బులా కమ్ముకొచ్చేస్తోంది. ఇది ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో పాటు పర్యావరణానికి పెను ముప్పుగా పరిణమించింది. దీనిపై ప్రభుత్వం నిషేధం విధించినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడంలేదు.

70 వేలకు పైగా జనాభా

పిఠాపురం పట్టణ పరిధిలో సుమారు 70 వేలకు పైగా జనాభా ఉండగా ప్రతిరోజూ సుమారు 32 టన్నులకు పైగా చెత్త ఉత్పన్నమవుతోంది. పట్టణ ప్రజలతో పాటు పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని వేలాది మంది ప్రతి రోజూ వివిధ అవసరాల కోసం పట్టణానికి వచ్చి పోతుంటారు. తద్వారా ప్లాస్టిక్ సంచుల విక్రయం విచ్చల విడిగా జరుగుతోంది. పిఠాపురం పట్టణ పరిధిలో ప్రతీరోజు మూడు లక్షలకుపైగా ప్లాస్టిక్ సంచులు అమ్మకాలు జరుగుతున్నట్లు అంచనా. పట్టణ పరిధిలోని పలు హోల్‌సేల్, చిల్లర దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులను విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ సంచులతో పాటు గ్లాసుల వినియోగం కూడా ఎక్కువగా ఉంది. వీటిని నిషేధించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ అమలు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు.

డ్రైన్లను ముంచెత్తుతున్న కవర్లు

సామాన్యుల దగ్గర నుంచి ధనవంతుల వరకూ ప్లాస్టిక్ కవర్లను వినియోగించడం పెరిగింది. ఇది ప్రమాదమని తెలిసినప్పటికీ ప్రజల్లో చైతన్యం మాత్రం కనిపించడంలేదు. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు వినియోగించి రోడ్లపై పడవేయడం వల్ల అవి మట్టిలో కలవకపోవడంతో కాలుష్యం పెరిగిపోతోంది. దీనికి తోడు వినియోగదారులు మార్కెట్ల నుంచి కూరగాయలు, చేపలు, మాంసం వంటి వాటిని ప్లాస్టిక్ సంచుల్లో తీసుకొని వచ్చి డ్రైన్లలో పడవేస్తున్నారు. దీంతో డ్రైన్లలో మురుగు ముందుకు పారడం లేదు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> ఇప్పటికే వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్ సంచులను అమ్మడం, కొనడం నిలుపుదల చేయాలని ఆదేశించాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని నిలిపివేసేలా చర్యలు తీసుకున్నాం. ఈ వారంలో దుకాణాలను తనిఖీలు చేయడానికి ఏర్పాట్లు చేశాం. ఎవరైనా నిబంధనలకు వ్యతిరేకంగా ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం.
>
> కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్, పిఠాపురం

మోటారు సైకిళ్ల వేలం రాబడి రూ.96వేలు

సిండికేట్‌తో ఆదాయానికి గండి



మోటారుసైకిళ్ల వేలం నిర్వహిస్తున్న ఎస్సై సునీత

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 56 మోటారుసైకిళ్లను బహిరంగ వేలం నిర్వహించగా రూ.96 వేలు ఆదాయం వచ్చినట్టు ఎస్సై టి.సునీత తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్టేషన్ ఆవరణలో ఉన్న మోటారుసైకిళ్లను తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. హెచ్చు పాటదారుడిగా బిక్కిన సాయి పాత మోటారు సైకిళ్లను దక్కించుకున్నాడు. సుమారు 12 మంది పాటదారులు హాజరైనప్పటికి అందరూ సిండికేట్ కావడంతో 56 మోటారు సైకిళ్ల బహిరంగ వేలం కేవలం రూ.96 వేలకు వెళ్లినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.ఐదు లక్షలు ఉంటుందనే వాదనలు ఉన్నాయి. కాగ ఈ వాహనాలకు రికార్డులు లేక పోవడం వల్ల బయట తిరిగిన సమయంలో పోలీసులు కేసులు పెడితే పోలీసు స్టేషన్‌కు ఎటువంటి సంబంధం లేదని ఎస్సై సునీత తెలిపారు.

బంద్ విఫలం

- పట్టించుకోని ప్రజలు
- యథావిధిగా తెరుచుకున్న వ్యాపార సంస్థలు

పిఠాపురం: మాజీ సీఎం చంద్రబాబునాయుడి అరెస్టుకు నిరసనగా టీడీపీ ఇచ్చిన బంద్ పిలుపును ప్రజలెవ్వరూ పట్టించుకోలేదు. సోమవారం యథావిధిగా జనం ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. టీడీపీ నేతలు మాత్రం రోడ్లపై తిరుగుతూ తమకు సహకరించాలని విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించకపోవడంతో ప్రదర్శనలకే పరిమితమయ్యారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు పిఠాపురం పట్టణం, గొల్లప్రోలులో నిరసన తెలిపారు. వ్యాపార సంస్థలు యథాతథంగా తెరుచుకున్నాయి. 144 సెక్షన్ అమలులో ఉండడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ పరిస్థితిని సమీక్షించారు.

పెద్దాపురం: మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టీడీపీ ఇచ్చిన బంద్ ప్రభావం సోమవారం పెద్దాపురంలో పెద్దగా కనిపించలేదు. తెలుగు తమ్ముళ్లు ఉదయాన్నే గంటన్నర సేపు మెయిన్‌రోడ్డు, పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించి దుకాణాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల సిబ్బందిని బయటకు పంపే ప్రయత్నం చేశారు. స్థానిక డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ అబ్దుల్ నబీ, ఎస్ఐ వెలుగుల సురేష్ ఎక్కడా ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతియుత వాతావరణంలో బంద్ పాటించేలా చర్యలు చేపట్టారు. గంటన్నర తరువాత స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నిలిచిపోయిన బస్సులను దగ్గరుండి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులను తరలించారు. స్థానిక శాసనసభ్యులు, ప్రథమ శ్రేణి తెలుగు తమ్ముళ్లు బంద్‌కు దూరంగా ఉండడంతో తృతీయ శ్రేణి టీడీపీ నాయకులు బంద్‌లో పాల్గొని నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కొత్తెం కోటి, ఎలిశెట్టి నాని, తూతిక రాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: టీడీపీ అధినేత చంద్రబాబును స్కిల్ స్కామ్ ముద్దాయిగా అరెస్టు చేసినందుకు నిరసనగా టీడీపీ సోమవారం ఇచ్చిన బంద్ మండలంలో పాక్షికంగా జరిగింది. టీడీపీ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు స్థానిక టీడీపీ, జనసేన నాయకులు బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు పట్టణంలో 114 సెక్షన్ అమలులో ఉన్నా గుంపులుగా ర్యాలీ నిర్వహించి షాపులు మూసి వేయాలని హెచ్చరికలు చేశారు. అదే విధంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో టిడ్కో ఇళ్ల కేటాయింపుకు సంబంధించి లబ్ధిదారులతో సమావేశం నిర్వహిస్తున్న సమయంలో టీడీపీ, జనసేన నాయకులు చాంబర్‌లోనికి వచ్చి హడావుడి చేసి కార్యాలయాన్ని మూసి వేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులు వెళ్లిన వెంటనే షాపులను యాథావిధిగా తెరచుకున్నాయి. బస్సులు యాథావిధిగా తిరగడంతో బంద్ ప్రభావం కనిపించలేదు.



పిఠాపురంలో కనిపించని బంద్ ప్రభావం, బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో తెరచి ఉంచిన షాపులు



బంద్ వల్ల ప్రజల ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక చేస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐ

డివిజన్ స్థాయి స్పందనకు ఐదు అర్జీలు

పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రతి వారం నిర్వహించే డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయా మండలాల నుంచి ఐదు అర్జీలు అందినట్లు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు తెలిపారు. తన కుమారుడు నుంచి ప్రాణ హాని ఉందని, భూ తగాదా పరిష్కరించాలని, ఆక్రమణలు తొలగించాలని, భూ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని తదితర సమస్యలపై ఐదు ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ వెల్లడించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ వారం వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మి, డీఎల్‌పీఓ బాలామణి, డీటీ భానుకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, ఏడీఏ దైవకుమార్, సీడీపీఓ ఉష, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలి

గోకవరం: జాతీయ అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలని ఫోక్స్‌పేట రేంజర్ ఎమ్.కరుణాకర్ అన్నారు. జాతీయ అటవీ సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సూదికొండ ఫోక్స్‌పేట రేంజర్ కార్యాలయంలో అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీ అమరవీరుల ఆశయ సాధనకు సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలన్నారు. అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి సుజాత, సెక్షన్ అధికారులు నూకరాజుదొర, డి.అప్పారావు, సిబ్బంది ప్రశాంత్, జగదీష్, మాణిక్యం, పద్మ, అరుణ, సుభద్ర, శ్రీను, మనోహర్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఫోక్స్‌పేటలో అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న రేంజర్ కరుణాకర్, సిబ్బంది

పంచాయతీ చట్టంపై అవగాహన పెరగాలి

సామర్లకోట: పంచాయతీ చట్టం–1994పై కార్యదర్శులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. శిక్షణ కేంద్రంలో సోమవారం కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులుగా ఉద్యోగాలు పొందిన వారికి శిక్షణ లేకపోవడం వల్ల కొన్ని సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం నిర్వహిస్తున్న విధులతో పాటు మల్టీ టాస్క్ విధులు కూడా నిర్వహించాల్సి ఉంటుందని, నగదు చిట్టాతో పాటు ఫైల్స్ తయారు చేయడం ఎంతో కీలకమని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు ఆరు రోజుల పాటు రెసిడెన్సియల్ శిక్షణ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీ పరిధిలో కొత్త లేఅవుట్ ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ప్రభుత్వ జీఓలు, ఉద్యోగుల విధి నిర్వాహణకు సంబంధించి క్రమశిక్షణ చర్యలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. సీనియర్ మాస్టర్ ట్రెనీలు శిక్షణ ఇస్తారని, అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. కోర్సు డైరెక్టరు శ్రీదేవి మాట్లాడుతూ గ్రేడ్-1, గ్రేడ్-5 కార్యదర్శులకు పంచాయతీ చట్టాలతోపాటు సాంకేతిక పద్ధతులలో సమస్యలు పరిష్కరించేలా అవగాహన పెంచామన్నారు. ప్రభుత్వ పథకాలు వాటి అమలు తీరుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, బి.ఆంజనేయులు, నిహరిక, ఎస్‌కే మోహీద్దీలు శిక్షణ నిర్వహించారు.



పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

వరకట్నం వేధింపులపై కేసు

కొత్తపల్లి: వరకట్నం వేధింపులకు సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సోమవారం స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నాగులాపల్లి శివారు ఉప్పరగూడేనికి చెందిన సన్నిబోయిన మహేశ్వరికి, అదే గ్రామానికి శ్రీనుకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా అదనపు వరకట్నం కోసం భర్త, అత్త వెంకటేశమ్మ వేధిస్తున్నారని మహేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయిబాబుకు ఎంపీడీఓగా పదోన్నతి



సామర్లకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేస్తున్న వీవీ సాయిబాబుకు ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సోమవారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనను ఎంపీడీఓ డి. శ్రీలలిత, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అభినందించారు.

వైదిక కార్యక్రమాలు వైభవంగా జరిపించాలి

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో నిత్యం జరిగే వైదిక కార్యక్రమాలు, స్వామివారి ఉత్సవాలు, వార్షిక కల్యాణోత్సవాలు అత్యంత వైభవంగా జరిగేలా కృషి చేయాలని దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కోరారు. అన్నవరం దేవస్థానంలో సుమారు 45 సంవత్సరాలు వ్రతపురోహితుడిగా, కల్యాణ బ్రహ్మగా, వ్రత ఉపబ్రహ్మగా కామేశ్వరశర్మ సేవలందించారు. ఆయన వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడిగా ఐదేళ్లు సేవలందించేందుకు 2021లో ట్రస్టుబోర్డు తీర్మానించింది. 2021 నుంచి 2022 వరకు ఏడాది పాటు ఆ పదవిలో కొనసాగారు. దేవస్థానం వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడిగా మూడేళ్ల పాటు ఆయన సేవలందించేందుకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ ఈ ఏడాది ఆగస్టులో మళ్లీ ఆదేశాలిచ్చారు. దీంతో కామేశ్వరశర్మను సోమవారం నిర్వహించిన దేవస్థానం ట్రస్టుబోర్డు సమావేశంలో ఎమ్మెల్యే పర్వత, ఆలయ చైర్మన్ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ సత్కరించారు. కామేశ్వరశర్మ తన అనుభవంతో ఇతర పురోహితులకు కూడా స్వామివారి వ్రతం, కల్యాణం తదితర విషయాల్లో శిక్షణ నివ్వాలని కోరారు. ఎమ్మెల్యే పర్వత, చైర్మన్, ఈఓలకు కామేశ్వరశర్మ కృతజ్ఞతలు తెలియచేశారు.



రత్నగిరిపై కామేశ్వరశర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పర్వత, చైర్మన్ రోహిత్, ఈఓ అజాద్

ఒంటరైనా... రైస్‌కార్డుకు అర్హులే

- వలంటీర్ల ద్వారా దరఖాస్తు
- గ్రామ సచివాలయాల్లో మంజూరు

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమం పొందడానికి అర్హత ఉండి పొందలేని వారి కోసం నిరంతరం ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని చెప్పుకోవాలి. గతంలో ఒంటరి మహిళలకు రేషన్ కార్డు మంజూరు చేసే అవకాశం లేదు. ముఖ్యమంత్రి పాలన చేపట్టాక అటువంటి ఒంటరి వ్యక్తుల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కరుణ చూపింది. ఇది వరకు కుటుంబం ఉంటేనే రేషన్ కార్డు మంజూరుకు అవకాశం ఉండేది. వారికి మాత్రమే సంక్షేమ పథకాలు వర్తించేవి. ఒంటరిగా ఉండే వారికి రేషన్ కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలకు నోచుకునే వారు కాదు. వారందరికీ లబ్ధి చేకూర్చాలని రైస్‌కార్డుల నిబంధనల్లో ఒంటరి వారికి కూడా రైస్‌కార్డు పొందేలా మూడేళ్ల కిందటే మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న ఒంటరి వ్యక్తులు రైస్ కార్డులు పొంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో ఒంటరి వ్యక్తులు ఏ కారణం చేతనైనా రైస్‌కార్డు పొందని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని పెద్దాపురం తహసీల్దార్ వి.జితేంద్ర చెబుతున్నారు.



ఒంటరి వ్యక్తులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రైస్‌కార్డు

సచివాలయాల్లోనే...

ఒంటరిగా ఉంటున్న మహిళలు, పురుషులకు రైస్‌కార్డుల మంజూరు కోసం గ్రామ, వార్డు వలంటీర్లు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్‌ఓలు దరఖాస్తులు పరిశీలించి మండల తహసీల్దార్‌కు నివేదికను అందజేస్తారు. అర్హులైన వారికి గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రైస్‌కార్డులను జారీ చేస్తారు. ఒంటరి వ్యక్తి రైస్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకుని బయోమెట్రిక్ వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది.

అర్హులు వీరే...

భర్త చనిపోయి పిల్లలు లేని ఒంటరి మహిళలు, అలాగే భార్య చనిపోయి పిల్లలు లేని ఒంటరి పురుషులు, 50 ఏళ్ల పైబడి పెళ్లి కానివారు, కుటుంబ సభ్యులు లేని నిరాశ్రయులు అర్హులే. ఇంకా ఒంటరి ట్రాన్స్‌జెండర్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఏ రైస్‌కార్డులో లేని వారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

> **అర్హులందరికీ రైస్‌కార్డుల మంజూరు**
>
> 
>
> రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు అర్హులై ఉండి వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త రేస్‌కార్డులు మంజూరు చేస్తాం. దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉంటే వెంటనే ఇస్తాం. గతంలో ఒంటరి వ్యక్తులకు రేషన్‌కార్డు మంజూరు చేసే అవకాశం ఉండేది కాదు. ప్రస్తుతం ప్రభుత్వాదేశాలతో వారికి కూడా రైస్‌కార్డులు మంజూరు చేస్తున్నాం. అర్హులైన వారు వలంటీర్లు ద్వారా గ్రామ/వార్డు సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవాలి.
>
> –వి.జితేంద్ర, తహసీల్దార్, పెద్దాపురం

గర్భిణులకు సామూహిక సీమంతాలు

శంఖవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో గర్భిణులకు, బాలింతలకు సోమవారం ఆయన పౌష్టికాహారం చేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 15 రోజులకు ఒక్కసారి పౌష్టికాహార కిట్లు అందిస్తున్నట్టు తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బంది ఎప్పటికప్పుడు బాలింతలకు, గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణాశ్రీ, ఉప సర్పంచ్ చింతనీడి కుమార్, మండల జేసీఎస్ అధ్యక్షుడు బుర్ర లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.



శంఖవరంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఎంపీపీ, అధికారులు

విరబూసిన బ్రహ్మ కమలాలు



కొత్తపల్లిలో విరబూసిన బహ్మకమలాలు

కొత్తపల్లి: గ్రామానికి చెందిన చింతలపూడి వెంకటరమణ ఇంటి వద్ద బ్రహ్మ కమలాలు విరబూసి అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వీటిని చూసేందుకు స్థానికులు భారీగా తరలి వస్తున్నారు.

క్లుప్తంగా

గణపతి నవరాత్రులకు రాట ముహూర్తం



కొత్తపల్లిలో చవితి ఉత్సవాలకు పందిరి రాట వేస్తున్న భక్తులు

కొత్తపల్లి: గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాల సందడి ప్రారంభమైంది. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం చవితి ఉత్సవాలకు పందిరిరాట వేశారు. కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, గోర్స, కొమరగిరి, మూలపేటతో పాటు కొత్తపల్లి బీటు వీధిలో నవరాత్ర మహోత్సవాలకు పసుపు రాట వేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్టేషన్ మాస్టరుకు సత్కారం



మహేశ్వరుడును సత్కరించిన స్టేషన్ మేనేజరు రమేష్ తదితరులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టరుగా పని చేస్తూ బదిలీపై వెళుతున్న ఎస్.గంగా మహేశ్వరుడును రైల్వే సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని స్టేషన్ మేనేజరు ఎం. రమేష్ అన్నారు. సుమారు రెండేళ్ల పాటు సామర్లకోట స్టేషన్‌లో పని చేసి కాకినాడ పోర్టు రైల్వే స్టేషన్‌కు బదిలీపై వెళుతున్న సందర్భంగా సోమవారం స్టేషన్ మేనేజరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టరు గంగా మహేశ్వరుడు చేసిన సేవలను పలువురు కొనియాడి, ఆయనను ఘనంగా సత్కరించారు. స్టేషన్ మేనేజరు రమేష్ రిలివింగ్ ఆర్డరును అందజేశారు.

దుకాణంలోకి దూసుకుపోయిన కారు



వేట్లపాలెం వద్ద పాన్ షాపులోకి దూసుకుపోయిన కారు

సామర్లకోట: కెనాల్ రోడ్డులో వేట్లపాలెం వద్ద రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఒక దుకాణంలోకి కారు దూసుకుపోయింది. సోమవారం రాజమహేంద్రవరం వైపు నుంచి సామర్లకోట కుటుంబ సభ్యులతో వస్తున్న కారు ఒకసారిగా అదుపు తప్పడంతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న పాన్ షాపులోనికి దూసుకుపోయింది. ఆ సమయంలో అక్కడ ఉన్న మోటారుసైకిలు మీదుగా పోవడంతో మోటారు సైకిలు నుజ్జు నుజ్జు అయింది. షాపు వద్ద ఉన్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు కారు డ్రైవరు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి సామర్లకోట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని స్వామి వారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం చివరి సోమవారం పురస్కరించుకొని స్వామికి ఆలయ అర్చకులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారి కుంకుమార్చనలు చేశారు. అదే విధంగా ఆలయంలో వేంచేసి ఉన్న ఉప ఆలయాలల్లో స్వామి వార్లు, అమ్మవార్లకు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ట్రస్టు బోర్డు సభ్యులు భక్తులకు సేవలందించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం నుంచి అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

కొత్తపల్లి: విద్యార్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని హెల్త్ ఎగ్జిక్యూటర్ కృష్ణారావు సూచించారు. మండలంలోని కోనపాపపేట జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు.